# రెండు ముఖాల చంద్రుడు

"ఎన్నాళ్ళుంటుందీ తద్దినం మనింట్లో" అడిగాడు రామచంద్రం.

"ఇంక రెండు రోజులుంటుందేమో మహావుంటే, ఎందుకంత అసహనం" అంది అరుంధతి.

అరుంధతి మేనత్త తెలిసిన వాళ్ళతో కలిసి ఉత్తరభారత యాత్రలు చేయటానికి వెళ్ళింది. తిరిగి వచ్చేటప్పుడు వాళ్ళు తమ బంధువులను చూడటానికి వాళ్ళ ఇంట్లో దిగితే తనక్కడవుండటమెందుకని మేనకోడలి సంసార మెట్లావుందో చూసి పోదామని వచ్చింది. ఆమె వచ్చినప్పటి నుండి రామచంద్రానికి విసుగ్గానే వుంది.

"ఏమంటోంది మన కాపురం గురించి నీ మొదటి మొగుడిలా నిన్ను చూసుకుంటున్నానంటోందా లేక వాడేనయమటా?"

"చచ్చి ఎక్కడున్నాడో ఆయన సంగతెత్తకు"

"అబ్బో పతివ్రత!"

"పతివ్రత నవునో కాదో తెలీకుండా చేసుకున్నావా నన్ను!"

"నోర్మూసుకో మొగుడి మాటకు ఎదురాడమని నేర్పించాడావెధవ నీకు" అని చరచరా అక్కడినుండి వెళ్ళిపోయాడు రామచంద్రం.

★ ★ ★

రామచంద్రం ఉద్దేశించిన ఆ 'వెధవ' అరుంధతి మొదటి భర్త భానుమూర్తి. అరుంధతి వాళ్ళ పక్కింట్లోనే ఓ గదిలో అద్దెకుండేవాడు. రతన్ ఇండస్ట్రీస్‌లో ఫోర్‌మన్‌గా పనిచేసేవాడు. అప్పుడామె బి.ఏ రెండో ఏడు చదువుతూండేది. సన్నగా, పొడుగ్గా, నాజూగ్గా, పట్టుకుంటే మాసిపోయేంతటి ఛాయతో కుదిరిగ్గా వుండే అరుంధతి అతన్ని మొదటి చూపులోనే ఆకర్షించింది. ఆమె కాలేజీకి వెళ్ళేటప్పుడు రోజూ తన గది గుమ్మం దగ్గరే నిలబడి ఆమెకేసి చూస్తూండే వాడతను. అలా ఎక్కువరోజులు ఆమెను చూస్తూ కాలం గడపలేదు అతను. ఓరోజు వాళ్ళ ఇంటికి వచ్చి అరుంధతి తండ్రి రామనాథంగారినే అడిగాడు సూటిగా "మీ అమ్మాయి నచ్చింది నాకు. ఆమెకు నేను నచ్చితే, మీకు మిగతా అభ్యంతరాలేవీ లేకపోతే నేనామెను వివాహం చేసుకోవాలనుకుంటున్నాను" అంటూ తనకి తల్లీదండ్రీలేరనీ, తన ఉద్యోగం, ఆర్థిక స్థితిగతులను

గురించీ ఆయనతో మాట్లాడాడు. రామనాథంగారికి భానుమూర్తి సూటితనం నచ్చింది. కూతుర్ని అడిగి ఆమె అంగీకారం మీద వారి వివాహం జరిపించాడు. కట్నకానుకల ప్రసక్తిలేకుండా చాలా నిరాడంబరంగా జరిగింది వారి పెళ్ళి.

వేరే అద్దె ఇంట్లో భానుమూర్తీ, అరుంధతీ కొత్తకాపురం పెట్టారు. అతనామె చదువు ఆపేయలేదు. బి.ఏ అయింతర్వాత ఆమె చదువు మానేస్తానంటే అతను ఒప్పుకోలేదు. ఎం.ఏ. చదవమన్నాడు. ''నావల్లకాదు బాబూ! ఇంక నేను చదవను'' అంది ఆమె.

''చదవకేం చేస్తావు మరి?'' అడిగాడు భానుమూర్తి.

''ఏం చెయ్యాలేం? మీ సేవలోనే సరిపోతుంది నాకు పొద్దస్తమానం'' అంది అరుంధతి.

''నేనేం దేవుణ్ణా నాకు సేవ చేయటానికి. పోనీ ఏదైనా ఉద్యోగం చెయ్యి.''

''ఏం నేను ఖాళీగా వుంటే మీకుతోచదా?''

''అలాకాదు ప్రతి వ్యక్తీ తనకాళ్ళమీద తను నిలబడాలి''

''నేనూ నాకాళ్ళమీదే నిలబడి వున్నాను'' అంది ఆమె తన కాళ్ళవంక చూసుకుంటూ.

''మొద్దూ! కాళ్ళమీదంటే కాళ్ళమీద కాదు ప్రతివ్యక్తికీ ఆర్థిక స్వాతంత్ర్యం వుండాలని నా వుద్దేశం. స్త్రీ పురుష వివక్షతలేదు దీంట్లో. ఎవరూ ఎవరిమీద ఆధారపడాల్సిన పనిలేదు.''

ఆమెకు నచ్చచెప్పి ఆమెచేత ఉద్యోగ ప్రయత్నాలు చేయించాడు భానుమూర్తి 'ఉద్యోగాలేం చెట్టుకు వేలాడి లేవుగా. వచ్చి ఏడ్చిందా పోనీ ఆయన ముచ్చటా తీరిస్తే సరి' అని ఉద్యోగాలకు పరీక్షలు రాస్తూ, ఇంటర్వ్యూలకు అటెండ్ కాసాగింది. ఫలితంగా ఓ జాతీయ బాంకులో ఉద్యోగం దొరికింది ఆమెకు. మొదటి నెల జీతం అతనికి ఇచ్చినప్పుడు భానుమూర్తి ''నాకెందుకు నీ జీతం. బాంకులోనే వుంచు, అవసరానికి వుపయోగపడుతుంది''అన్నాడు. ఆ నెలే కాదు. అతను బతికున్నంత వరకూ ఏనెలా ఆమె జీతం వాడుకోలేదతను.

భానుమూర్తి ఆలోచనలు సంప్రదాయానికి భిన్నంగా, విచిత్రంగా వుండేవి. ఓరోజు-

''మన పక్కింటి వెంకటరమణగారు మళ్ళీ పెళ్ళిచేసుకోబోతున్నారు. విన్నారా ఈ సంగతి' అంది అరుంధతి.

''అందులో ఆశ్చర్యమేముంది. భార్యపోయి ఏడాదయింది. ఎన్నాళ్ళు ఒంటరిగా వుంటాడు'' అన్నాడు అతను.

''అదే నేననేది. అంత ప్రేమగా వుండేవాళ్ళు కదా., అంత ప్రేమా ఓ ఏడాదిలో అంతమయిందేమో అని. మళ్ళీ పెళ్ళికి తయారయాడు.''

''బావుంది పోయిన ఆవిడతో ఆయనా పోలేడుగా. బతికున్న మనిషి తన బతుకు సంగతి చూసుకోనక్కర్లా.''

''అదే ఈయనపోయి, ఆవిడ బతికివుంటే జీవితాంతం భర్తనే తల్చుకుంటూ గడిపేదికదా, మళ్ళీ పెళ్ళిమాట తలపెట్టేదా?''

''అదే పొరపాటు. స్త్రీలు కూడా పునర్వివాహాలు చేసుకోవాల్సిందే. తన జీవితం నిస్సారంగా గడపటం ఆమె ప్రేమించిన ఆ భర్త నవమానించటమే. భార్య సుఖపడకూడదను కుంటాడా ఆ భర్త? భర్త పోయిన ఆడది బొట్టూ, గాజులూ తీయాల్సిన పనిలేదు. అవి అతనితోపాటు రాలేదుగా, అతను పోగానే పోవటానికి.''

''ఈ మాటలకేంలెండి, మన వాళ్ళకే ఎవరికయినా అలా జరిగితే అప్పుడు సమర్థించండి. వప్పుకుంటాను మీవి వట్టిమాటలుకావు, గట్టిమాటలని.''

''వాళ్ళూ వీళ్ల సంగతెందుకుకానీ! ఏదయినా అనుకోనిదే జరిగి నేనే చనిపోతే నువ్విప్పుడు ఎలావున్నావో అలాగే వుండాలి. మళ్ళీ పెళ్ళి చేసుకోవాలి...''

''ఛీ... ఛీ... అపశకునం మాటలు. నోటికి ఎంతొస్తే అంత మాట్లాడేయటమేనా!'' అని చేత్తో అతని నోటిని మూసేసింది అరుంధతి.

చేత్తో అతని నోరుమూయ గలిగింది గాని, తన దురదృష్టాన్ని తప్పించుకోలేకపోయింది అరుంధతి. ఫ్యాక్టరీలో షార్ట్ సర్క్యూట్ అయి ఫ్యాక్టరీ చాల భాగం తగలబడిపోగా, బయటకు రాలేక మంటల్లో చిక్కుకుపోయిన పదిమందిలో ఒకడయాడు భానుమూర్తి. కాలి బొగ్గయిపోయిన అతన్ని చూసి ఆమె గుండెలు అవిసిపోయేట్టు ఏడ్చింది. ఆస్పత్రిలో చేర్పించిన మర్నాడే అతడు చనిపోయాడు. పోయేటప్పుడు మళ్ళీ పెళ్లిచేసుకోమనీ, ఆమె బతుకు నిస్సారంగా గడిపితే అది తన ప్రేమను అవమానపర్చటమనీ, తన్ను శిక్షించటమనీ చెప్పాడు. ఏం సమాధానం చెప్పలేక గుడ్లనీరు కుక్కుకుంటూ అతన్ని చూస్తుండిపోయింది అరుంధతి.

తల్లీదండ్రీ తనే అయి పెంచిన రామనాథంగారు తమ పెళ్ళయిన కొద్దిరోజులకే హృద్రోగంతో మరణించాడు. ఇప్పుడు భర్త కూడా గతించటంతో వంటరిదయిపోయింది అరుంధతి. భానుమూర్తి ముందుచూపుతో ఆమెకు ఉద్యోగపు ఆసరా ఇవ్వకపోయినట్లయితే ఆమె నడిబజార్లో పడాల్సివచ్చేది. భర్తపోయిన తరువాత బొట్టుపెట్టుకోవటానికీ, గాజులు వేసుకోటానికీ మనస్కరించలేదు అరుంధతికి. నిరాసక్తంగా జీవితం గడపసాగింది ఆమె.

జీవితం సరళరేఖ కాదు. అనుకున్నట్టుగా అన్నీ జరుగవు. రామచంద్రం ఆమె పనిచేసే బ్రాంచికే బదిలీ అయి రావటం జరిగింది. వచ్చినప్పటినుంచి అతని దృష్టి ఆమెమీద పడింది. అరుంధతి భర్త కంపెనీవాళ్ళు ఆమెకు నష్టపరిహారం కింద చాల తక్కువ డబ్బు మంజూరుచెయ్యగా, అది అన్యాయమనీ ఆమెకింకా ఎక్కువ డబ్బు రావాలని సలహా ఇచ్చిందీ, లాయర్ని కుదిర్చి పెట్టిందీ, కేసున్నప్పుడల్లా కోర్టు చుట్టూ తిరిగింది రామచంద్రమే. అతని కృషిఫలితంగా ఆమెకు రెండులక్షల నష్టపరిహారం వచ్చింది.

కోర్టులో కేసు జరిగేటప్పుడే అరుంధతీ, రామచంద్రంల మధ్య సాన్నిహిత్యం పెరిగింది. తనను వివాహం చేసుకోమని అడిగాడు రామచంద్రం. ఆమె ఓ పట్టాన ఒప్పుకోలేదు. భానుమూర్తిని మర్చిపోలేకపోయింది.

''ఓసారి పెళ్లైన దానికి మళ్ళీ పెళ్ళేమిటి?'' అనేది అరుంధతి.

''బావుంది నువ్వేం ముసలిదానవయి పొయ్యావా? పాతికేళ్ళు కూడా వుండవు నీకు. జీవితమంతా తోడులేకుండా గడపటం ఎంత కష్టం. ఇంత అందం, ఆకర్షణ అడవిలో కాచిన వెన్నెలయిపోవాల్సినదేనా?'' అనేవాడతను.

''అబ్బ నావెంట పడ్డారెందుకు? మీకు పెళ్ళికాని ఆడపిల్లలు చాలా మంది దొరుకుతారు.''

''చక్కటి అమ్మాయి దొరకవచ్చుగానీ, నీలాంటి అమ్మాయి దొరకదు. ఇన్నేళ్ళూ నీలాంటి అమ్మాయిదొరక్కే పెళ్ళిచేసుకోలేదు నేను. నువ్వుకాదంటే నాకీ జన్మలో పెళ్ళిగీత లేదని వూరుకుంటాగానీ మరో అమ్మాయిని చేసుకునేది కల్ల.''

రామచంద్రం అంతటితో వూర్కోలేదు. ఆమెను సినిమాలకూ, షికార్లకూ తీసుక వెళ్ళేవాడు. సినిమా హాల్లో దగ్గరకు తీసుకుని ముద్దు పెట్టుకొనేవాడు. ఓసారి పురుష సాంగత్యం చవిచూసిన ఆమె నరాలు జివ్వుమని లాగేవి. మెల్లమెల్లగా బలహీనపడిపోసాగింది. చివరికి ఓ బలహీనక్షణంలో ఆమె అతన్ని పెళ్ళి చేసుకోవటానికంగీకరించింది.

కొలీగ్స్ అందరూ అభినందించారు. రామచంద్రంలాటి మంచివాడు, ఆమెని పునర్వివాహం చేసుకుంటున్నాడంటే అది ఆమె అదృష్టంగా అభివర్ణించారందరూ.

పెళ్లైన మొదటి రాత్రే రామచంద్రం ఆమెకు తన అసలు రంగులో బయటపడ్డాడు.

రామచంద్రంను పెళ్ళిచేసుకుందిగాని, భానుమూర్తిని మర్చిపోలేకపోయింది ఆమె. ఏదో తప్పుచేసిన భావన ఆమెలో కలగసాగింది. అతన్ని తల్చుకుంటే ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

''ఏంటీ అలావున్నావు?'' అంటూ వచ్చాడు రామచంద్రం గదిలోకి.

''ఏంలేదు'' అంది ఆమె పమిటి కొంగుతో కళ్ళు తుడుచుకుంటూ.

''ఏం లేకపోవటమేం, ఏదో వుంది చెప్పు.''

''ఏం లేదులెండి, ఆయన గుర్తుకు వచ్చాడు''

''ఓహో నీ మొదటి మొగుడా! అతన్ని మర్చిపోవటం మంచిది. నాతో కాపురం చేస్తూ పరాయి పురుషుణ్ణి తల్చుకుంటూ వుండటం నాకు నచ్చదు.''

అరుంధతేం మాట్లాడలేకపోయింది. భానుమూర్తి తనకు పరాయి పురుషుడా? రామచంద్రం పరాయి వాడా?

ఆ నెల ఫస్టు తారీకున అడిగాడు రామచంద్రం ఆమెని ''ఈనెల జీతం ఏం చేశావు?'' అని.

''డబ్బు డ్రా చెయ్యలేదు. నా అకౌంట్‌లోనే వుంది బాంక్‌లో'' అంది ఆమె.

''డ్రా చెయ్యి. డబ్బు నీ దగ్గర పెట్టుకున్నావుంటే సంసార మెట్లా గడుస్తుంది.''

''అయ్యో ఎందుకలా మాట్లాడతారు. నేనేం నా జీతం ఇవ్వనన్నానా?''

''నీ జీతం నాకేం ఇవ్వనక్కర్లేదు. ఇంటద్దెకట్టు, ఇంటి ఖర్చుకుపయోగించు.''

''నాజీతం సరిపోదేమోనండీ!''

''సరిపెట్టుకోవాలి. కొంచెం జాగ్రత్తగా ఖర్చుచేయటం నేర్చుకో.''

''బావుంది నేనేం దుబారా చేస్తున్నాను? అయినా మీ జీతమేం చేస్తున్నారు?''

''అప్పులుతీర్చాలి.''

''అప్పులెందుకుచేశారు?'' అని ఆమె అడగలేదు. ఎందుకు చేయాల్సి వచ్చిందో ఆమెకు కొద్ది కాలంలోనే అర్థమయింది. ఆదివారంవస్తే ఇంట్లో వుండడు. పేకాట ఆడటానికి వెళ్తాడు. ఒక్కోరోజు రాత్రికి కూడా ఇంటికి రాడు. మర్నాడు బాంకికే డైరెక్ట్‌గా వచ్చేవాడు. సీజన్‌లో రేస్‌కోర్స్‌లోనే కాపురం పెట్టేవాడు. అతని జీతం వాళ్ళు పెళ్లైన మొదటి నెలే కాదు ప్రతినెలా అప్పులు తీర్చటానికే సరిపోయేదికాదు.

ఇద్దరూ స్కూటర్‌మీద బాంక్‌కి వెళ్ళేవాళ్ళు. సాయంత్రం బయట తనకు పనున్నా భార్యని స్కూటర్‌మీద ఇంట్లో దింపిగాని వెళ్ళేవాడు కాదు. ''మా ఆవిడ మరీ సుతారమండీ దేనికీ ఓర్చుకోలేదు'' అని గొప్పగా చెప్పేవాడు కోలీగ్స్‌తో. సహోద్యోగులతో కలుపుగోలుగా హాస్యంగా, జోవియల్‌గా మాట్లాడేవాడు. ఆనందించే ఆడకూతురున్నప్పుడు సరసంగా ద్వంద్వార్థాలతో మాట్లాడేవాడు. దాంతో బాంకిలో అతనికి చాలా మంచివాడనీ, హాస్యశీలి అనీ పేరువచ్చింది. అందరి కష్టాలు తనవే నన్నట్లుండేవాడు. ''మా ఆవిడ కాంపన్సేషను కేసుకు ఎంత తిరగాల్సి వచ్చిందంటారు'' అనేవాడు. నిజంగా అవసరమైన క్షణంలో మనిషిని నట్టేట్లో ముంచేవాడనీ లేక ఆ పరిస్థితిని తనకనుకూలంగా మార్చుకుంటాడనీ చాలమందికి తెలీదు. అతని దృష్టంతా ఆమె అకౌంటులో వున్న డబ్బు మీద వుంది. నష్టపరిహారంగా వచ్చిన రెండులక్షలు, భానుమూర్తి ఉండగా ఆమె దాచుకున్న రెండులక్షలు, మొత్తం నాలుగు లక్షలు ఆమె అకౌంటులో చూసినప్పటినుండి ఆ డబ్బు ఎలా రాబట్టాలా అన్న మథనలో పడి పోయాడు రామచంద్రం.

''విద్యానగర్‌లో కొత్త ఫ్లాట్లు కడుతున్నారు. నీదగ్గర నాల్గు లక్షలుందిగా దాంతో కొందాం'' అన్నాడోరోజు సాయంత్రం.

ఇంట్లో పైస ఇవ్వకుండా తన జీతం మొత్తం తగలెడ్తున్న రామచంద్రమంటే ఆమెకు మంటగావుంది.

''ఇప్పుడు మనకు ఫ్లాటేమవసరంలేదు. నేనా డబ్బు ఖర్చుపెట్టదల్చుకోలేదు'' అంది.

''వెధవముండని పెళ్ళి చేసుకున్నందుకు మాబాగానే చేస్తున్నావు. నువ్వు నాకు కట్నమే మిచ్చావు? ఆడబ్బు, నీజీతం లేకపోతే నిన్నెవడు పెళ్ళిచేసుకొనేవాడు?''

''నాకూ అర్థమవుతోంది లేండి ఇప్పుడిప్పుడే, నన్నెందుకు పెళ్ళిచేసుకున్నారో.''

''ఆ డబ్బు డ్రాచేసిస్తావా సరేసరి. లేకపోతే విడాకులిచ్చేస్తాను గుర్తుంచుకో'' అని బెదిరించాడామెను.

అతనితో మాట్లాడటం ఆమెకసహ్యంవేసింది. మాట్లాడకుండా వంటింట్లోకి వెళ్ళిపోయింది.

అయితే ఆమెను సాధించటానికీ, హింసించటానికీ వేరువేరు మార్గాలు వెతకసాగాడతను. డబ్బు ఇవ్వకపోవటంతో ఆమెమీద కసి ఏర్పడింది అతనికి. సభ్యతా సంస్కారాల ముసుగులొదిలేసి అసలు రంగులో కనబడసాగాడు రామచంద్రం. ఎప్పుడూ తన్ను భానుమూర్తితో పోల్చుకునేవాడు. తనతోడి సహజీవనంలో భానుమూర్తిని మరిపించేట్టు చేయలేకపోవటమేకాక, ఎప్పుడూ అతన్ని కించపరుస్తున్నట్లు మాట్లాడి, అతన్ని ఆమెకు గుర్తుకు తెస్తూ వుండేవాడు. ప్రతి రాత్రీ ఆమెకు రామచంద్రంతో గడపాలంటే భయం కలిగేది, జుగుప్స కలిగేది.

''ఎన్నాళ్ళు సంసారం చేశావు అతడితో'' అడిగాడు రామచంద్రం ఓసారి.

''మూడేళ్ళు'' అంది ఆమె.

''అతడితో అనుభవం ఎలా వుండేది?''

''.........''

''చెప్పు.''

''ఏం చెప్పాలి?''

''నేనెక్కువ సుఖం ఇస్తున్నానా? వాడెక్కువ ఇచ్చేవాడా?''

''ఆయన గురించి 'వాడు వీడు' అనకండి.''

అతని ప్రశ్నకామె ఏమి సమాధానం చెప్తుంది. సుఖం, ఆనందం మానసికమైనవి, శారీరకమైనవి కావని ఆజడుడికేం చెప్పగలదు?

''మరేమనాలి, నాక్కాబోయే ఆడదాన్ని ముందే అనుభవించిన వెధవను?''

''నువ్వు నన్ను పెళ్ళి చేసుకుంటావని ఆయనేం కలగన్నారా? అసలు ఆయన చేసుకో మంటేనే నిన్ను పెళ్ళి చేసుకున్నాను'' అంది ఆమె అతన్ని తన మీద నుండి పక్కకు తోసేస్తూ. ఆమెకా కలయికలో సౌఖ్యమేం కలుగలేదు. పైగా జుగుప్స, వ్యభిచరించినంత హైన్యం కలిగింది మనసులో, అలాటి మనసుకు గౌరవ వాచకాలు పట్టవు.

''వాడికి నేను తెలీదుగా అప్పుడు'' అన్నాడు రామచంద్రం ఆమెనొదలకుండా.

''నువ్వు తెలీకపోతేనేం. మళ్ళీ పెళ్ళి చేసుకోమంది ఆయనే.''

''ఛీ చవట. పెళ్ళాన్ని ఇంకోడి పక్కలో పడుకోబెట్టే నపుంసక వెధవ.''

''ఛూ...లే..'' అంది ఆమె అతన్ని పక్కకి తోసి లేచి కూర్చుంటూ.

''ఏమయిందే నీకు వళ్ళు పొగరుగావుందా. రా ఎక్కడకు పోతావు పాడుముండా!'' అని జుట్టుపట్టుకు పక్కలోకి లాగాడు ఆమెని రామచంద్రం.

అతన్ని వదిలించుకోవాలని చేసే ప్రయత్నంలో అతన్ని రక్కింది ఆమె.

''నన్నేగిచ్చుతావటే రాక్షసి ముండ'' అని ఆమెను పట్టుకుని ఆ చెంపా ఈచెంపా వాయించాడు రామచంద్రం.

అలా జీవితంలో మొదటిసారి దెబ్బలు తింది అరుంధతి. నిర్ఘాంతపోయి అచేతనావస్థలో కూర్చుండిపోయింది. అతడామెను వదలలేదు. తన కసితీరా హింసించి ఆమెననుభవించాడు.

ఒకోరోజు భానుమూర్తి ప్రస్తావన తీసుకురాకపోయినా పక్కలోకి వస్తే చాలు నోటికొచ్చినట్లు తిట్టేవాడు ఆమెను రామచంద్రం. సెక్స్ ఆక్ట్‌లో తిట్టుకూడా అతనికో భాగం. తననుభవించే ఆడదాన్ని తిడ్తే, కొడ్తే, హీనంగా చూస్తే ఎంతో ఆనందం కలిగేది అతనికి.

మరోసారి బాంకిలో తమతో పనిచేసే లేడీ కొలీగ్స్ ప్రస్తావన తీసుకువచ్చేవాడు.

''ఆ మందాకిని వుంది చూశావు. ఓ సరాగం లేదు సరసం లేదు.''

''ఆవిడ ఏమయితే మనకెందుకు?'' అనేది అరుంధతి.

''నీరజ మాత్రం గజ్జల గుర్రంలా వుంటుంది. అది ఏరోజూ మొగుణ్ణి నిద్రపోనీదనుకుంటా.''

''.........''

''దిట్టంగా స్ప్రింగ్ కాట్‌లా వుంటుందిలే, అణచి పెడ్తే పైకెగిరేటట్టు. నువ్వూ వున్నావు ఎందుకూ ఏబ్రాసిమొహానివి సన్నగా తోటకూరకాడలా ఈసురోమంటూ.''

''తెలిసే చేసుకున్నావుగా నేనేం నీవెంట పడలేదే పెళ్లిచేసుకోమని.''

''అదిగో మొగుణ్ణి నువ్వనటం మర్యాదగాలేదు.''

''మనసులోలేని గౌరవం మాటల్లోరాదు. ఆయన 'నువ్వు' అనే పిలవమనేవాడు. అయినా నేనే అలా పిలవలేకపోయేదాన్ని. నువ్వు కావాలన్నా ఛస్తే నీకు గౌరవం ఇవ్వను.''

అంతే, ఆ చెంపా ఈ చెంపా వాయించాడు రామచంద్రం.

''నన్ను చావమంటావే ముండా! ఆ చవట వెధవే నిన్ను చెడగొట్టాడు. ఆడదాన్ని ఎలా వుంచాలో తెలీని ఆడారి వెధవ'' అన్నాడు.

''ఆయన సంగతెత్తకు. ఆయన కొనగోటికి కూడా సరిపోవు నువ్వు.''

''వాడసలు మగాడేనా అంట? మూడేళ్ళు కాపురం చేసినా వెధవ నీకు ఒక్కసారీ కడుపుచేయలేకపోయాడు. మనం చూస్కో ఆర్నెల్లల్లోనే...''

''అదేం పెద్ద ఘనకార్యం కాదు. రొమ్ము విరుచుకు చెప్పుకోవటానికి. కుక్కలూ, పిల్లులూ కంటున్నాయి పిల్లల్ని. మనిషిగా బతకటం తెలీని ఎలుగ్గొడ్డువు నువ్వు. మేం మొదట్లో పిల్లలు వద్దనుకున్నాం. కావాలనుకునే సమయానికి ఆయన పోయారు, నీలాంటి దరిద్రుడి పాలబెట్టి నన్ను'' అనిలేచి వెళ్ళి పక్కగది తలుపు గడియ వేసుకుంది, అతను రాకుండా అరుంధతి.

మామూలుగా అయితే అరచి, తిట్టి, తలుపులు దబదబాబాది గోలచేసేవాడు రామచంద్రం. ముందు వరండాలో పడుకున్న అరుంధతి మేనత్తకు ఈ గోలంతా తెలుస్తుందని ఏం చెయ్యకుండా వూరుకున్నాడు అతను.

భానుమూర్తితోడి జీవితం మూడేళ్ళు మూడు క్షణాల్లా గడిచిపోయాయి! రామచంద్రంతోడి ఆర్నెల్ల జీవితం ఆరు జన్మల నరకాన్ని చవిచూపిందామెకు 'ఇహ లాభం లేదు విడిపోవాలి ఇతడి నుండి' అన్న నిర్ణయానికొచ్చింది అరుంధతి.

★ ★ ★

''వస్తాను నాయనా! ఇవాళ మద్రాసు బండిలో వెళ్తున్నారు నన్ను యాత్రలకు తీసుకొచ్చినవాళ్ళు'' అంది అరుంధతి మేనత్త స్టేషనుకు వెళ్ళటానికి తయారయి.

''ఇంకా మీరు రెండు రోజులుంటే బాగుండేది పిన్నిగారు! మీరున్న ఈవారం రోజులూ ఎంత హాయిగా వుందనీ. మాకు పెద్ద వాళ్ళులేని లోపాన్ని భర్తీ చేశారు'' అన్నాడు రామచంద్రం.

''ఇప్పుడు కాదులే బాబూ! మళ్ళీ ఇంకోసారి వస్తాను'' అని అరుంధతితో ఆటోలో రైల్వేస్టేషనుకు బయలుదేరింది ఆమె.

దోవలో అంది ఆమె అరుంధతితో.

''మీ ఆయన నిజంగా శ్రీరామచంద్రుడే. బుద్ధిమంతుడు'' అని.

అరుంధతేం మాట్లాడలేదు. 'అవున్నిజమే శ్రీ రామచంద్రుడు కాదు, వట్టి చంద్రుడు. అందరికీ కన్పించే చంద్రబింబం తెల్లగా, కాంతివంతంగా ఆహ్లాదం కలిగిస్తుంది. అదే బింబం వెనుక వైపు కాంతి విహీనంగా నల్లగావుంటుంది. అలాటి రెండు ముఖాల వాడే ఈ చంద్రుడూ. సభ్యతా, సంస్కారాల బట్టలు తొడుక్కున్న రామచంద్రం అందరికీ శ్రీరామచంద్రుడిలాగే కనిపిస్తాడు. మహా మంచివాడి లాగానే కన్పిస్తాడు. ఆ వేషం వెనుకవున్న నల్లటి వికృత రూపం తనకొక్క దానికే తెల్సు' అనుకుంది అరుంధతి.

'ఆంధ్రభూమి' సచిత్రవారపత్రిక

28-6-1990